కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లకు సూచన
- వీసీలో పాల్గొన్న జిల్లా అధికారులు

సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

రంగారెడ్డి, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ) : జిల్లాల్లో నిర్దేశించిన ప్రణాళికా ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో తక్షణమే ప్రారంభించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డి అన్నారు. శనివారం మంత్రి ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ధాన్యం సేకరణకు సంబంధించి తీసుకోవల్సిన చర్యల గురించి పౌర సరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి డీఎస్ చౌహాన్ సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా జరిగేలా జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు. సన్నరకం ధాన్యం సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించిందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన ధాన్యం శుభ్రపరిచే ప్యాడీ క్లీనర్లు, క్వాలిపర్స్ ఇతర సామగ్రిని యుద్ధప్రాతిపదికన సమకూర్చాలన్నారు. దొడ్డురకం ధాన్యాన్ని సన్నరకం ధాన్యంతో కలుపకుండా చూడాలని., సన్నరకం కొనుగోలు కేంద్రాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ దొడ్డురకం ధాన్యం రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాలు పేరుతో కోతలు అమలు చేయకుండా చూడాలని, నాణ్యతా ప్రమాణాలు పరిశీలించిన తర్వాతే కాంటా చేయాలని సూచించారు. ధాన్యంపై అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం చేయాలని, రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకుని రావాలని మంత్రి సూచించారు. జిల్లాలోని రైస్ మిల్లర్లకు ధాన్యం కేటాయింపు కోసం బ్యాంకు గ్యారంటీ తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేసిందని, వీటిని కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు.

అందుబాటులో ఉండేలా చర్యలు

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ ప్రక్రియ కోసం అవసరమైన అన్ని ప్రాంతాల్లో రైతులకు కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుంచి రైస్ మిల్లులకు ధాన్యం కేటాయింపు ప్రక్రియ కూడా ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో సివిల్ సప్లై డీఎం, డీసీవో, జిల్లా మార్కెటింగ్ అధికారి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి పాల్గొన్నారు.

తప్పనిసరిగా ప్రారంభించాలి

వికారాబాద్ : జిల్లాలో నవంబర్ 4 నుంచి తప్పనిసరిగా వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన వరి ధాన్యం సేకరణ, సీఎంఆర్‌పై తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రెటరీ డీఎస్ చౌహాన్, ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లు, పౌర సరఫరాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పలు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ... నవంబర్ 4 నుంచి జిల్లా వ్యాప్తంగా రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రణాళిక ప్రకారం అన్ని చర్యలు చేపట్టాలన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మౌలిక సదుపాయాల కల్పనతో పాటు తాగునీరు, టెంట్లు, గోనె సంచులు, టార్పాలిన్ షీట్‌లను సమకూర్చాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతాన్ని గుర్తించే పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని, దొడ్డు, సన్న రకం ధాన్యాన్ని వేర్వేరుగా సేకరించి మార్గదర్శకాలకు అనుగుణంగా గుర్తులను సూచించాలని ఆయన తెలిపారు. కలెక్టరేట్ నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పౌరసరఫరాల అధికారి మోహన్ బాబు, జిల్లా మేనేజర్ విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి, డిప్యూటీ డీఆర్‌డీవో సరోజ తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్ : వీసీకి హాజరైన అదనపు కలెక్టర్, జిల్లా అధికారులు

రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేయాలి


మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మొయినాబాద్, నవంబర్ 2: రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేయాలని స్థానిక నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. బెంగుళూర్-ముంబయి రహదారి నుంచి వయా కందవాడ, నక్కలపల్లి, వెంకటాపూర్ మీదుగా శంషాబాద్-షాబాద్ రోడ్డును కలుపుతూ ఉన్న రహదారి పూర్తిగా గుంతలమయంగా మారిందని మంత్రికి వివరించారు. శంషాబాద్ నుంచి చేవెళ్ల, అక్కడి నుంచి నుంచి శంషాబాద్‌కు వెళ్లడానికి ఈ రోడ్డు అనువైన మార్గమని తెలిపారు. ప్రస్తుతం ఉన్న రోడ్డు చిన్నగా ఉండడంతో పాటు గుంతలమయంగా మారి అధ్వానంగా ఉన్నదని వివరించారు. రోడ్డు విస్తరణకు రూ.11 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో పల్గుట్ట మాజీ సర్పంచ్ జనార్దన్ రెడ్డి, మొయినాబాద్ పీఏసీఎస్ మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు మల్లారెడ్డి, రాంరెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అక్షరాస్యతను పెంచేలా కృషి చేయాలి

- విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం
- పాల్గొన్న జిల్లా అధికారులు

రంగారెడ్డి, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమం ఇంప్లిమెంటేషన్‌పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ డైరెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత సంవత్సరంలో 4లక్షల మంది నిరక్షరాస్యులుండగా.. ఇప్పుడు 8.30లక్షల మంది నిరక్షరాస్యులున్నారని తెలిపారు. 15 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయస్సున్న నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. ఒక్కో వలంటీర్‌కు ఐదుగురు చొప్పున నిరక్షరాస్యులను కేటాయించాలన్నారు. 7 నుంచి 9వ తరగతి విద్యార్థులను వలంటీర్లుగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇంటర్, డిగ్రీ, అంగన్‌వాడీ టీచర్లను, మహిళా సంఘాల సభ్యులను ప్రైవేటు టీచర్లను ఆసక్తి ఉన్న విద్యావంతులను గుర్తించి అక్షరాస్యతను పెంచే దిశగా చర్యలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు.

ఈ నెల చివరిలోపు డేటా సేకరణ

జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. 2011 సెన్సెస్ ప్రకారం 71.95శాతం అక్షరాస్యత ఉందన్నారు. అందులో 78.94శాతం పురుషులు, 64.63శాతం మహిళలున్నారని తెలిపారు. జిల్లాకు నిర్దేశించిన లక్ష్యం 49,852 మంది అని తెలిపారు. దీనికి సంబంధించి మండలాల్లో ఎంఈవోలు, ఎంపీడీవోలు, మహిళా సంఘాలు ఈ నెల చివరిలోపు డేటాను సేకరిస్తారని తెలిపారు. జిల్లా అధికారులతో కూడిన కమిటీలను., అలాగే, డివిజన్‌లు, మండలాలవారీగా కమిటీలను వేయటం జరుగుతుందని తెలిపారు. అబ్దుల్లాపూర్ మెట్ మండలంలో 14 గ్రామపంచాయతీల్లో ఇప్పటికే వాచింగ్, బ్యాచింగ్ చేయటం పూర్తయ్యిందని, 2341 నిరక్షరాసులున్నారని వారికి 263 వలంటీర్లను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. సమావేశంలో జిల్లా డీఆర్‌వో సంగీత, జిల్లా విద్యాధికారి సుశీంద్రర్‌రావు, డీపీవో సురేశ్‌మోహన్ ఉన్నారు.

126 వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

వికారాబాద్, నవంబర్ 2: జిల్లా వ్యాప్తంగా 2024-25 సీజన్‌కు వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు వీలుగా 126 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 1.05,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు సన్నాహాలు చేశామన్నారు. రైతులు పండించిన ధాన్యం గ్రేడ్- ఏ రకానికి రూ.2,320లు, సాధారణ రకానికి రూ.2,300, సన్న రకం ధాన్యానికి అదనంగా రూ.500 చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. 126 వరి కొనుగోలు కేంద్రాలకు 34 ఐకేపీ, 61 పీఏసీఎస్, 31 డీసీఎంఎస్ ఏజెన్సీల ద్వారా 108 కేంద్రాల్లో దొడ్డు రకం వరి ధాన్యం, 18 కేంద్రాల్లో సన్న రకం వరి కొనుగోలు చేసేందుకు నిర్ణయించామని తెలిపారు. రైతులు ఎండబెట్టిన, చెత్త, తేమ లేకుండా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు.

పైన పూతలు.. ఆపై గోతులు

- తట్టిఅన్నారంలో రూ.3.2కోట్ల బీటీ రోడ్డు
- ఒక్క వర్షానికే అధ్వానంగా మారిన రహదారి

పెద్దఅంబర్‌పేట, నవంబర్ 1: రూ.కోట్ల నిధులతో వేస్తున్న రోడ్లు ఒక్క వానకే గుంతలు పడిపోతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపమా? కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యమా కారణం ఏదైనా జనానికి మళ్లీ గుంతల రోడ్డు కష్టాలను చూపిస్తున్నాయి. మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారం లోని అంబేద్కర్ చౌరస్తా నుంచి మర్రిపల్లి గ్రామం వరకు 3 కిలోమీటర్ల వి స్తీర్ణం కోసం హెచ్ఎండీఏ నిధులు రూ.3.2 కోట్లతో బీటీ రోడ్డు వేశారు. ముక్కలు ముక్కలుగా విభజించి పనులు చేపట్టారు. కొన్నిచోట్ల పనులు పూర్తయి ఏడాది కావొస్తున్నది. అటవీశాఖ, ఇతర కారణాలతో ఆర్కేనగర్ చివరి నుంచి మర్రిపల్లి వరకు రోడ్డు వేయలేదు. వేసిన రోడ్డుపై పలుచోట్ల అప్పుడే పెద్ద గోతులు పడ్డాయి. రాళ్లు తేలి జనం అటుగా వెళ్లేందుకు భయపడే పరిస్థితి నెలకొన్నది. ఇక వానొస్తే రోడ్డే కుంటను తలపిస్తున్నది. ఇటీవల వర్షాలు కురిసిన సమయంలో ఈ గుంతల రోడ్డుపై వెళ్తూ ప్రమాదాలు సైతం చోటుచేసుకున్నాయని స్థానికులు చెబుతున్నారు. రూ. కోట్లు వెచ్చించి వేసిన రోడ్లు అప్పుడే రాళ్లు తేలడంపై స్థానికులు మండిపడుతున్నారు. అటు హెచ్ఎండీఏ అధికారులు తొంగిచూడకపోవడం.. ఉన్న మున్సిపల్ అధికారులు దృష్టి సారించకపోవడంతో గుంతలు మరింత పెద్దవవుతున్నాయి. ఈ విషయంపై మున్సిపల్ డీఈఈ శివానందం మాట్లాడుతూ.. సంబంధిత కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చి, రోడ్డును బాగు చేయిస్తామని చెప్పారు.

సాగర్ రోడ్డుకు కొత్తరూపు!

- రహదారి విస్తరణకు అధికారుల ప్రణాళికలు
- ముమ్మరంగా హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ
- బీఆర్ఎస్ హయాంలోనే డీపీఆర్ సిద్ధం

నాగార్జున సాగర్ రోడ్డు

యాచారం, నవంబర్ 2: నాగార్జునసాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారికి త్వరలో మంచిరోజులు రానున్నాయా అనే ప్రశ్నకు అవునే సమాధానం వినిపిస్తున్నది. నాగార్జున సాగర్ రోడ్డు వెడల్పు కోసం అధికారులు కసరత్తు చేస్తున్నారు. రోడ్డు సేఫ్టీ రూల్స్‌లో భాగంగా ప్రమాదాలను అరికట్టేందుకు, ప్రయాణికులు సులభంగా గమ్యస్థానాలకు చేరేందుకు ఈ రహదారిని విస్తరింపజేయాలని అధికారులు ప్రణాళికలను రచిస్తున్నారు. ఇందుకోసం ఆర్ అండ్‌బీ, మెట్రో అధికారులు గతంలోనే సర్వే నిర్వహించిన విషయం తెలిసిందే.

ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తే..

సాగర్ రోడ్డు వెడల్పునకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తే జిల్లా పరిధిలో 30 కిలో మీటర్ల దూరం సాగర్ రోడ్డు విస్తరణకు నోచుకోనున్నది. యాచారం, మాల్ కేంద్రాల్లో సుమారు 3కిలోమీటర్ల మేర ఇప్పటికే నాలుగు లైన్ల రోడ్డు ఉండడంతో మరో 27కిలో మీటర్లు డబుల్ రోడ్డును నిర్మించాల్సి ఉంటుంది. ఇబ్రహీంపట్నం సెయింట్ కళాశాల నుంచి మాల్ వరకు సాగర్ రోడ్డు నాలుగు లైన్ల రోడ్డుగా అభివృద్ధి చెందనున్నది. మధ్యలో డివైడర్‌తో పాటు 16మీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. రోడ్డు డివైడర్‌కు అటూ ఇటూ 11మీటర్ల వెడల్పు కానున్నది. ఇరువైపులా 5మీటర్ల సర్వీస్ రోడ్డును సైతం ఏర్పాటు చేయనున్నారు. కొంత మేర ఫుట్ పాత్ రోడ్డు ఏర్పాటు చేయనున్నారు.

హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో..

తాజాగా హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో రోడ్డు వెడల్పు కోసం వారం క్రితం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు. యాచారం మండల కేంద్రంలో తిరుమలేశుని గుట్ట సమీపంలో నాగార్జున సాగర్ రహదారిపై హెచ్ఎండీఏ అధికారులు శ్రీనివాస్, మధుతో పాటు సిబ్బంది ఉదయ్, ప్రసాద్, బన్నీ, నిఖిల్, సైదులు, శివ, వరప్రసాద్‌లు ట్రాఫిక్ పోలీసుల సహకారంతో ప్రయాణికులు, వాహనదారుల అభిప్రాయాలు తీసుకున్నారు. రోడ్డుకు ఇరువైపులా రాకపోకలు కొనసాగించిన ప్రయాణికులను ఆపి రోడ్డు వెడల్పులో భాగంగా వారి అభిప్రాయాలను సేకరించారు. సాగర్ రహదారిని వెడల్పు చేయాలా.. వద్దా..? రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలని ప్రశ్నించారు. ప్రయాణికులు తమ అభిప్రాయాలను అధికారులకు వెల్లడించారు. వారం క్రితం సుమారు 6వేల మందికి పైగా ప్రయాణికుల అభిప్రాయాలను మెట్రో సిబ్బంది సేకరించారు. రోడ్డును వెడల్పు చేయాలని ప్రయాణికులు, వాహనదారులు, ప్రజలు సమాధానం ఇచ్చారు. సేకరించిన ప్రజల అభిప్రాయాలను హెచ్ఎండీఏ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని సర్వే చేసిన అధికారులు శ్రీనివాస్, మధు పేర్కొన్నారు.

యాచారంలో ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్న హెచ్ఎండీఏ సిబ్బంది

మారనున్న రూపురేఖలు

సాగర్ రోడ్డు రూపురేఖలు ఒక్కసారిగా మారనున్నాయి. రోడ్డు వెడల్పు కోసం బీఆర్ఎస్ హయాంలో మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సమక్షంలో ఆర్‌అండ్‌బీ అధికారులు డీపీఆర్ (డిటేయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు)ను సిద్ధం చేసిన విషయం తెలిసిందే. ఆర్‌అండ్‌బీ, మెట్రో అధికారులు సర్వే చేసి హద్దులు సైతం గుర్తించారు. రోడ్డు వెడల్పు జరిగితే హైదరాబాద్ నుంచి నాగార్జున సాగర్ మీదుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రవాణా సౌకర్యం మరింతగా మెరుగుపడనున్నది. ప్రజల ప్రయాణం సులభతరం కానున్న ది. ఈ రోడ్డు గుండా హైదరాబాద్ నుంచి ఇబ్రహీంపట్నం, మాల్, మల్లెపల్లి, దేవరకొండ, సాగర్, మాచర్ల, గుంటూరు, నెల్లూరు, వినుకొండ, చిలుకలూరిపేట, కనిగిరి, మార్కాపురం, పొదిలి తదితర పట్టణాలకు తక్కువ సమయంలో సులభంగా చేరుకోవచ్చని ప్రయాణికులు అంటున్నారు. దేశంలోనే ఎంతో ప్రసిద్ధి చెందిన నాగార్జున సాగర్ ప్రాజెక్టు, బుద్ధవనాన్ని దర్శించుకునేందుకు దేశీయులే కాకుండా విదేశీయులు సైతం అధికంగా వస్తుంటారు. పర్యాటకులు ఇక్కడి నుంచి నేరుగా సులభంగా అక్కడికి చేరుకోవచ్చని అభిప్రాయపడుతున్నారు. నిత్యం వందలాది వాహనాలతో ఎంతో రద్దీగా ఉండే ఈ రోడ్డు వెడల్పు అయితే ట్రాఫిక్ జామ్ సమస్యను అధిగమించవచ్చని, రోడ్డు ప్రమాదాలను దాదాపుగా పూర్తిస్థాయిలో నివారించవచ్చని ప్రజలు, ప్రయాణికులు పేర్కొన్నారు. రోడ్డు వెడల్పు విస్తరణ ఎప్పుడు మొదలవుతుందో వేచి చూడాల్సిందే మరి.

ఆసరా పింఛన్ పెంపు కోసం 26న చలో హైదరాబాద్

సమావేశంలో మాట్లాడుతున్న దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య

వికారాబాద్, నవంబర్ 2: ఆసరా పింఛన్ దారుల పింఛన్ పెంపు కోసం ఈ నెల 26న చలో హైదరాబాద్ చేపడుతున్నామని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని అతిథి గృహంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) జిల్లా ముఖ్య నాయకుల సమావేశం జిల్లా అధ్యక్షుడు శ్యాం ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జంగయ్య మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ నెల 1 నుంచి 16 వరకు అన్ని జిల్లాల్లో సదస్సులు నిర్వహించి, 17 నుంచి 23 వరకు అన్ని కలెక్టరేట్ల ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టాలని పిలుపునిచ్చామన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే లక్షలాది మందితో 26న చలో హైదరాబాద్ చేపడుతామన్నారు. ఈ నెల 11న వికారాబాద్‌లో ఐదు వేల మందితో ఆసరా పింఛన్ దారుల మహాసభను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రచార కార్యదర్శి చిట్టి రాజు, సహాయ కార్యదర్శి విజయ్ కుమార్. జిల్లా ప్రధాన కార్యదర్శి నల్ల రాజు, జిల్లా నాయకులు కె.రాములు, గోరయ్య, రమణ చారి, హుస్సేన్ బి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మేసిన మంచు

శంకర్‌పల్లి మండల పరిధిలో మంచు కురిసింది. శనివారం తెల్లవారు జాము నుంచి రహదారులు, పంట పొలాలన్నీ మంచుతో కమ్ముకున్నాయి. వ్యవసాయ పొలాలకు, ఇతర పనులకు వెళ్లే రైతులు మంచు కారణంగా కొద్దిగా ఆలస్యంగా వెళ్లారు. గ్రామాలన్నీ మంచుతో కమ్ముకోవడంతో రహదారిపై వెళ్లే వాహనదారులు లైట్లు వేసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి జిల్లా

అనంతగిరి జాతరకు సకల వసతులు కల్పించాలి

సమావేశంలో మాట్లాడుతున్న అనంతగిరి పరిరక్షణ సమితి సభ్యులు నర్సింహులు, అంజి రెడ్డి

వికారాబాద్, నవంబర్ 2: త్వరలో జరగబోయే అనంతగిరి జాతరకు అధికారులు సకల వసతులు కల్పించాలని అనంతగిరి పరిరక్షణ సమితి సభ్యులు నర్సింహులు, అంజి రెడ్డి అన్నారు. శనివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో అనంతగిరి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేరళలో ఉన్న అనంత పద్మనాభ స్వామి ముఖ్య పీఠమైన అనంత పద్మనాభ స్వామి ఆలయమే అని చరిత్ర సూచిస్తున్నదన్నారు. దేశంలో 5 వేల ఏండ్ల నుంచి సనాతన ధర్మం కొనసాగుతున్నదని తెలిపారు. వీటిని దృష్టిలో పెట్టుకొని 9 ఏండ్ల క్రితం అనంతగిరి పరిరక్షణ సమితి ఏర్పాటు చేశామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా పరిరక్షణ సమితి పని చేస్తుందన్నారు. ప్రతి ఏడాది అనంత పద్మనాభ జాతర జరుగుతుందని, అధికారులు మాత్రం ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతున్నారని ధ్వజమెత్తారు. ఈసారి జాతరకు అన్ని సౌకర్యాలు కల్పించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌ను కలిసి గుర్తు చేశామన్నారు. ధర్మ పరిరక్షణలో భాగంగా ప్రతి హిందువు గిరి ప్రదక్షిణలో పాల్గొనాలని చెప్పారు. 2019 నుంచి ఈ కార్యక్రమం కొనసాగుతున్నదని, ఇందు కోసం అధికారికంగా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. జాతరకు వచ్చే మహిళలకు ప్రత్యేక స్నానపు గదులు, మరుగుదొడ్లు, ఆలయ మాఢ వీధులు, గుండం వద్ద ప్రత్యేక విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసుల బందోబస్తు పెంచాలని కోరారు. భక్తులకు ఆరోగ్య సమస్యలు తలెత్తితే చూసుకోవడానికి వైద్యులను అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారికి తెలిపారు. జాతర చివరి రోజు గిరి ప్రదక్షిణ ఉంటుందని, అనంతరం అనంత పద్మనాభ స్వామి చక్రతీర్థం నిర్వహించాలని ఆలయ అధికారులకు సూచించారు. ఈ జాతర కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేయాలని కోరారు. సమావేశంలో ధార్మిక సంఘం జిల్లా కన్వీనర్ డాక్టర్ రాజశేఖర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరోత్తం రెడ్డి పాల్గొన్నారు.